ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 19.05.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు జాప్యం లేకుండా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు.

2. నదీ జలాల్లో వాటా సహా ఇతర అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం ఈరోజు వాయిదా పడింది.

3. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 27వ తేదీన కౌన్సెలింగ్ ప్రారంభంకానుంది.

4. రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

**ప్రాజెక్టులు**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు జాప్యం లేకుండా నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. హైదరాబాద్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈరోజు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు 'పాలమూరు పోరుయాత్ర' పేరిట

పాదయాత్ర చేస్తామనడం విడ్డూరమని వాకిటి శ్రీహరి అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో చెప్పి ప్రజల వద్దకు వెళ్లాలని హితవు పలికారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తామని గతంలో కేసీఆర్ అన్నారని జూపల్లి గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. పాదయాత్ర చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని చెప్పారు.

**డెస్క్**

---------------------------------

**వాయిదా**

నదీ జలాల్లో వాటా సహా ఇతర అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం మరోమారు వాయిదా పడింది. బోర్డు 21వ సమావేశాన్ని తొలుత ఈ నెల 14వ తేదీన ఏర్పాటు చేశారు. అదే రోజు ఏపీ కేబినెట్ సమావేశం ఉండడంతో భేటీని ఈనెల 21వ తేదీకి గతంలో వాయిదా వేశారు. అయితే.. ఈ నెల 21న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. దీంతో కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విజ్ఞప్తి మేరకు 21న జరగాల్సిన సమావేశాన్ని కేఆర్ఎంబీ వాయిదా వేసింది. సమావేశం తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని కృష్ణా బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చారు.

**డెస్క్**

------------------------------

**పాలిటెక్నిక్**

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 27వ తేదీన కౌన్సెలింగ్ ప్రారంభంకానుంది. రెండు విడతల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన విడుదల చేశారు. తొలి విడత కౌన్సెలింగ్ సీట్లను జూన్ 6న కేటాయిస్తారు. అదే నెల 9న పాలిటెక్నిక్ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. చివరి

విడత కౌన్సెలింగ్ జూన్ 15న ప్రారంభమై 22వ తేదీతో ముగుస్తుంది. జూన్ 27 నుంచి 30 వరకు ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహిస్తారు. స్పాట్ ప్రవేశాలను జులై 1 నుంచి 8 తేదీల మధ్య పూర్తిచేసుకోవాలని నిర్దేశించారు. ఈ నెల 13న పాలిసెట్ నిర్వహించగా.. 23వ తేదీలోపు ఫలితాలు వెల్లడించనున్నారు.

**డెస్క్**

-------------------------------

**వివరాలు సేకరణ**

కొత్త ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కోసం ఉద్యోగుల వివరాలు సేకరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులు, పింఛనర్ల వివరాలు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని వివిధ విభాగాలను ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈనెల 31 నాటికి వివరాలు అప్‌డేట్ చేయాలని సూచించింది. జూన్ 2న ఉద్యోగులు, పింఛనర్లకు హెల్త్‌కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈహెచ్ఎస్ వివరాల సేకరణకు ఆదేశాలు జారీ చేసింది.

**డెస్క్**

----------------------------

**పొడిగింపు**

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. గరిష్ఠ వయోపరిమితి 44 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లోకి ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీస్ లకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయోపరిమితిని పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

**డెస్క్**

-----------------------------------

**ముఖ్యమంత్రి పర్యటన**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నట్లు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో భవాని శంకర్ తెలిపారు. జిల్లాలోని యాదగిరిగుట్టలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... టెంపుల్ సిటీలో నిర్మించనున్న లక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో కొండపైన నిర్మించనున్న కళ్యాణ మండపం, దీక్షాపరుల సదనం, మెట్ల మార్గానికి పైకప్పు, మాడ వీధుల్లోకి వెళ్లే కొత్త మెట్ల మార్గానికి కూడా శంకుస్థాపన జరగనుంది. మొత్తం 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు ఈఓ వెల్లడించారు.

**పీటీసీ – యాదాద్రి భువనగిరి**

----------------------------

**ఎస్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్**

తెలంగాణ రాష్ట్రాన్ని గతంలో పాలించిన బిఆర్ఎస్, ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీలు తెర వెనుక ఒకరికొకరు సహకరించుకుంటున్నాయని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ రోజు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ క్రమంగా ఉనికి కోల్పోతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకరినొకరు కాపాడుకుంటూ పైకి మాత్రం కొట్టుకున్నట్లు నటిస్తున్నాయని ఆరోపించారు.

**డెస్క్**

---------------------------------

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తుందని రామగుండం శాసనసభ్యుడు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఈరోజు పెద్దపల్లి జిల్లా ఎగ్లాస్ పూర్ లో జరిగిన కార్యక్రమంలో ఇందిరా మహిళా శక్తి ఆర్టీసీ బస్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు.

**పీటీసీ - పెద్దపల్లి**

---------------------------

**కడియం శ్రీహరి**

ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా  పని చేస్తున్నట్లు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి  తెలిపారు. ఈరోజు జనగామ జిల్లా గండి రామారం ఎత్తిపోతల పథకంలోని లిఫ్ట్-1 పంపు హౌస్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జులై 31నాటికి ఈ పనులు పూర్తి చేయాలని, ఈ వర్షాకాలంలోనే లిఫ్ట్-1 ద్వారా సాగు నీరు అందించాలని స్పష్టం చేశారు.

**పీటీసీ - జనగామ**

---------------------------

**యువజన క్రీడా వారోత్సవాలు**

నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్  తెలిపారు.  యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఈ నెల 23వ తేదీ వరకు యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతాయని అన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో యువత, విద్యార్థులు చాలా కీలకమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద  సమ్మర్ క్యాంపులు  నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారన్నారు

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

----------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది. ఇదే సమయంలో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర క్రమంగా పెరుగుతాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నల్గొండ, ఖమ్మం తదితర జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశం ఉందని, నాల్గవ రోజు నుంచి పొడి వాతావరణం ఏర్పడుతుందని వెల్లడించింది.

**డెస్క్**

---------------------------------

**ధాన్యం కొనుగోలు కేంద్రాలు**

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి, బీబీనగర్ మండలాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం నిల్వ, తరలింపు ప్రక్రియపై అధికారులతో మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, హమాలీలు, లారీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**పీటీసీ – యాదాద్రి భువనగిరి**

---------------------------

**జన్ జాతీయ గరిమ ఉత్సవ్**

జన్ జాతీయ గరిమ ఉత్సవ్ 2026, జన్ భాగీ దారి సబ్సే దూర్ సబ్సేపహలె కార్యక్రమంలో భాగంగా ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ ఆవరణలో పీవో రాహుల్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన జాతీయ గరిమ ఉత్సవాల్లో భాగంగా

మారుమూల గిరిజన ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ఈరోజు నుంచి 25వ తేదీ వరకు గిరిజనుల గ్రామాలకు అధికారులు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తారని అన్నారు.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

-----------------------------

**గుడుంబా కేంద్రాలపై దాడులు**

మంచిర్యాల జిల్లా బుయ్యారం గ్రామంలో గుడుంబా తయారీ కేంద్రాలపై  ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. 30 గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి 3 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.

**పీటీసీ - మంచిర్యాల**

-----------------------------

**యాదాద్రి జనగణన**

జనగణన-2027లో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. జిల్లాలోని చౌటుప్పల్‌లో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు మొబైల్ యాప్ ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు.

**పీటీసీ – యాదాద్రి  భువనగిరి**

-----------------------------

**జనగామ - జనగణన**

జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లాలో జరుగుతున్న  ఇండ్ల గణన ప్రక్రియను  కలెక్టర్ స్వయంగా  పరిశీలించారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ... మొదటి దశలో జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు.

**పీటీసీ - జనగామ**

-------------------------

**భద్రాద్రి - జనగణన**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో ఈరోజు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా పర్యటించారు. మల్లెల మడుగు గ్రామంలో నిర్వహిస్తున్న జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం, సీతారాంపురంలోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

-------------------------------

**బంద్**

దేశవ్యాప్తంగా రేపు ఆల్ ఇండియా కెమిస్టుల బంద్ నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు అత్యవసర మందుల సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు జనగామ జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ బాల కృష్ణ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మందులు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ఫార్మసీలు అత్యవసర సేవల నిమిత్తం సాధారణంగా పనిచేయనున్నవని పేర్కొన్నారు.

**పీటీసీ - జనగామ**

-------------------------